క్లుప్తంగా

ఐదోరోజు...ఆరుగురు
నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు



ప్రత్తిపాడు: నామినేషన్ల పర్వంలో భాగంగా ఐదో రోజైన మంగళవారం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా కత్తి కిరణ్‌కుమార్, చంద్రం కృష్ణంరాజు, ఇండియన్ లేబర్ పార్టీ (అంబేడ్కర్-పూలే) తరఫున యండ్రపాటి పాల్, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా బుర్రి రాంబాబు నామపత్రాలు దాఖలు చేశారు. అలాగే భారతీయ చైతన్య యువజన పార్టీ నుంచి సంకురు స్తోత్రరాణి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా చల్లా శరత్‌కుమార్‌లు రెండో సెట్ నామినేషన్ వేశారు. ఈమేరకు తమ అభ్యర్థిత్వ పత్రాలను రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్‌కు అందజేశారు.

ఏడుగురు వలంటీర్ల రాజీనామా



వంగిపురం (ప్రత్తిపాడు): ప్రత్తిపాడు మండలం వంగిపురంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. వంగిపురం గ్రామ సచివాలయం క్లస్టర్‌లోని తిమ్మాపురం, మేడావారిపాలెం, వంగిపురం గ్రామాల్లో కలిపి 20 మంది వలంటీర్లు విధులను నిర్వర్తిస్తున్నారు. వారిలో ఇప్పటికి ముగ్గురు ఇదివరకే సేవలకు స్వస్తి చెప్పారు. కాగా మరో ఏడుగురు మంగళవారం స్వచ్ఛందంగా తప్పుకున్నారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను స్థానిక పంచాయతీ కార్యదర్శి కృష్ణకుమారికి అందజేశారు.

బీసీ విభాగం జిల్లా కార్యదర్శిగా గండు



ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ గుంటూరు బీసీ విభాగం జిల్లా కార్యదర్శిగా ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామానికి చెందిన గండు నాగరాజును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులిచ్చింది. ఈమేరకు అధిష్టానానికి నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

గంజాయి నిందితుల ఇళ్లలో సోదాలు



గుంటూరు రూరల్: గంజాయి కేసుల్లో నిందితులై, అనుమానాస్పదంగా వ్యవహరించే వ్యక్తుల ఇళ్లలో నల్లపాడు సీఐ నరేశ్ కుమార్ సోదాలు జరిపారు. మంగళవారం రాత్రి స్వర్ణభారతినగర్, సమ్మర్‌పేట, అడవి తక్కెళ్ళపాడు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. నిషేధిత ఉత్ప్రేరకాలను విక్రయించినా, వినియోగించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి విక్రయాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను ఆయన సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



పెదకాకాని: గుంటూరు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరిన మానసిక పరిస్థితి బాగాలేని మహిళ మంగళవారం మృతి చెందింది. పెదకాకాని నుంచి గుంటూరు వెళ్ళే మార్గంలో జాతీయ రహదారి చెంత అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను పోలీసులు 108లో ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం మరణించింది. మానసిక పరిస్థితి సరిగా లేని ఆమె తనపేరును లావణ్యగా చెప్పిందని, వివరాలు తెలిసిన వారు పెదకాకాని పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలని సీఐ కె వీరాస్వామి తెలిపారు.

బాకీదారులను బెదిరించిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: డబ్బులు అడిగిన బాకీదారులను బెదిరించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొరిటిపాడుకు చెందిన అంజిరెడ్డి చిట్టీ పాటలు నిర్వహిస్తుంటాడు. ఈక్రమంలో పలువురికి పాట డబ్బులు చెల్లించలేదు. మంగళవారం పాటదారులు సాంబశివరావు, వెంకటేశ్వర్లు, వీరశంకరరెడ్డి మరికొందరు అంజిరెడ్డి ఇంటికి వెళ్లి బాకీ డబ్బులు అడిగారు. అంజిరెడ్డి వారిని బెదిరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురళీకృష్ణనికి మద్దతుగా..నామినేషన్ కు తరలిరాగా..











వైఎస్సార్‌సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ నామినేషన్ కార్యక్రమానికి మంగళవారం పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. చేబ్రోలు మండలం నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లారు. పెదకాకాని మండలం నుంచి పార్టీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పొన్నూరుకు ప్రత్యేక వాహనంపై బయలుదేరగా, చేబ్రోలు మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు, కార్లతో భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఎండ తీవ్రతను సైతం లెక్క చేయకుండా మహిళలు, యువకులు, వృద్ధులు ఉత్సాహంతో ముందుకు సాగారు. జై జగన్, జై అంబటి అనే నినాదాలతో కేరింతలు కొట్టారు. కొత్తరెడ్డిపాలేనికి చెందిన చేబ్రోలు-4 ఎంపీటీసీ ఇంటూరి జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబటి మురళీకృష్ణ చేపట్టిన ట్రాక్టర్ల ర్యాలీ అందర్నీ అలరించింది. –పెదకాకాని, పొన్నూరు, చేబ్రోలు

భక్తులతో పోటెత్తిన కొండపాటూరు

- పోలేరమ్మకు లక్షమల్లెల పూజ
- ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం
- జిల్లా నలుమూలలనుంచి తరలివచ్చిన మహిళలు



పోలేరమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ చైర్మన్ నరేశ్ కుమార్ దంపతులు



పోలేరమ్మ తల్లి లక్ష పల్లె పూజలో పాల్గొన్న జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మహిళలు

కొండపాటూరు (కాకుమాను): మండలంలోని కొండపాటూరులో వెలసిన స్వయంభూ కొండపాటూరు పోలేరమ్మ తల్లికి మంగళవారం రాత్రి లక్ష మల్లెల పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా కన్నుల పండువలా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మ వారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. రాత్రి అమ్మ వారు వివిధ అలంకారాలతో దర్శనమివ్వగా అశేష భక్తజనం ఆధ్యాత్మిక పారవశ్యంలో తరించింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం,తదితర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన మహిళా భక్తులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

శోభాయమానంగా...

ఆలయానికి ఇరువైపులా విద్యుత్ దీపాలతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మ వారి పూజా కార్యక్రమాన్ని తిలకించేందుకు దేవాలయం చుట్టూ భారీ స్క్రీన్‌లు ఏర్పాట్లు చేశారు. అర్చకులు వంశీ ఆధ్వర్యంలో అమ్మ వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లను ఉత్సవ కమిటీ చైర్మన్ నరేశ్ కుమార్, దేవాలయ కార్యనిర్వహణాధికారి సురేశ్ ,దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాకుమాను, పెదనందిపాడు ఎస్‌ఐలు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఈనెల 30న శిడిమాను ఉత్సవం:

ఈనెల 30న అమ్మ వారికి కుంకుమ పూజా కార్యక్రమం శిడిమాను మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కంఠమనేని నరేష్ కుమార్ తెలిపారు. అమ్మ వారి దర్శన నిమిత్తం వచ్చే భక్తుల సౌకర్యార్థం దేవాలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

సుస్థిర పాలన జగన్‌తోనే సాధ్యం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ ఏటుకూరి విజయ్‌కుమార్ మాదిగ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ ఏటుకూరి విజయ్‌కుమార్ మాదిగ తదితరులు

ప్రత్తిపాడు: ఏపీలో బడుగు బలహీన వర్గాలకు సుస్థిరపాలన అందించడం సీఎం జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీకే సాధ్యమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ ఏటుకూరి విజయ్‌కుమార్ మాదిగ అన్నారు. వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు, లేమల్లెపాడు, వట్టిచెరుకూరు మాదిగ పల్లెల్లో మంగళవారం ఆయన ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాదిగ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీపై ప్రజల్లో రోజురోజుకీ నమ్మకం పెరుగుతుందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఏనాడో గాలికి వదిలేసిన ఎన్డీఏ, ఇప్పుడు చంద్రబాబు, పవన్ తో జట్టుకట్టి ప్రజల ముందుకు వస్తుందన్నారు. కార్యక్రమంలో కాకుమాను సుబ్బారావు, సిద్దెల శ్యామ్, వెంకటేశ్, విజయబాబు, ఇజ్రాయిల్, ఓలేటి భూషణం, గుండాల ఆనంద్, కొమరాల శ్రీనివాస్, బుల్ల అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు వైద్య విభాగానికి పరికరాల వితరణ



డాక్టర్ శ్రీనివాస ప్రసాద్‌కు రూ.5లక్షలు విలువగల వైద్య పరికరాలు అందజేస్తున్న జింకానా సభ్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి మత్తు వైద్యవిభాగానికి రూ.5లక్షల విలువ గల వైద్య పరికరాలను జింకానా మాజీ అధ్యక్షుడు డాక్టర్ త్రిపురనేని రవి అందించడం అభినందనీయమని ఆసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం సూపరింటెండెంట్ చాంబర్‌లో జింకానా కో–ఆర్డినేటర్లు డాక్టర్ బాలభాస్కరరావు, డాక్టర్ హనుమంతరావులు వైద్య పరికరాలు మత్తు వైద్య విభాగానికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ ఈ వైద్య పరికరాలు రోగులకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. వైద్యులకు, పీజీ వైద్య విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. జింకాన సభ్యులు మెడికల్ కళాశాలకు, ప్రభుత్వ ఆసుపత్రికి అన్ని విధాలా సహాయ పడుతున్నారని, వారి సేవలకు ధన్యవాదాలు తెలిపారు. అనస్థీషియా విభాగం వైద్యులు డాక్టర్ పోలయ్య, డాక్టర్ క్రిస్టఫర్, డాక్టర్ శ్యాంకుమార్, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ రెమిమో, డాక్టర్ శ్యాంసన్, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నామినేషన్‌కు ప్రభుత్వ వాహనం

- రైల్వే శాఖ వాహనంపై ఊరేగింపుగా వెళ్లిన టీడీపీ తూర్పు నియోజక వర్గ అభ్యర్థి నసీర్ అహ్మద్
- అధికారుల చోద్యం



ఆన్ డ్యూటీ ఎస్.సి. రైల్వే అని స్టిక్కర్ ఉన్న వాహనంపై ఊరేగింపుగా వెళుతున్న నసీర్ అహ్మద్

లక్ష్మీపురం: గుంటూరులో నామినేషన్‌లు వేసేందుకు ఆయా పార్టీలు పోటాపోటీగా ఊరేగింపులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే తెలుగు దేశం పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నామినేషన్ వేసేందుకు దక్షిణ మధ్య రైల్వే శాఖకు సంబంధించిన ఒక వాహనంలో వెళ్లడం నగరంలో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. సోమవారం తెలుగుదేశం పార్టీ తూర్పు నియోజక వర్గ అభ్యర్థి నసీర్ అహ్మద్ నామినేషన్ దాఖలు చేసేందుకు తూర్పు నియోజకవర్గం నుంచి నగరపాలక సంస్థ వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపునకు దక్షిణ మధ్య రైల్వేశాఖ పేరు ఉన్న (ఆన్ గవర్నమెంట్ డ్యూటీస్ సౌత్ సెంట్రల్ రైల్వే) వాహనాన్ని పూలతో అలంకరించి దానిపై ఊరేగింపు నిర్వహిస్తూ స్థానికులకు అభివాదం చేస్తూ వచ్చారు. దీన్ని గమనించిన స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. మరో వైపు ఎన్నికల అధికారులు నసీర్ ఉపయోగించిన ప్రభుత్వ వాహనాన్ని పట్టించుకోకపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం తథ్యం

- ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి
- గుంటూరు రూరల్ మండల నేతలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి, పక్కన బలసాని

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారి రోశయ్య, ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ తిరుగులేని మెజారిటీతో గెలుపొందడం తథ్యమని శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. బృందావన్‌గార్డెన్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని పార్టీ గుంటూరు రూరల్ మండల ముఖ్యనేతల సమావేశం విస్తృత స్థాయి సమావేశం జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికలు రెండు పార్టీలు, ఇద్దరు వ్యక్తులు మధ్య జరిగే సాధారణ ఎన్నికలు కావని, అభివృద్ధి, సంక్షేమానికి – అబద్ధాలు మోసానికీ మధ్య జరుగుతున్న ఎన్నికలని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో తమకు ఓటు వేశారా లేదా..? 2024లో వేస్తారా వేయరా..? అని ఏమాత్రం చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించారని చెప్పారు. ఓవైపు టీడీపీ, బీజేపీ, జనసేనలు కలిసి ముప్పేట దాడి చేసినా.. మరోవైపు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు కలిసొచ్చినా.. ప్రజాబలంతో ఒంటరిగా నిలిచిన సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి కాకుండా ఆపడం ఎవరి తరమూ కాదని తేల్చి చెప్పారు.

ఎంపీగా రోశయ్య..

ప్రత్తిపాడులో బలసాని గెలుపు ఖాయం

గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి కిలారి రోశయ్య అత్యంత సమర్థుడైన నాయకుడన్నారు. రోశయ్య గెలుపుతోనే గుంటూరు సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజాసేవ చేయాలన్న తలంపుతో రాజకీయాల్లోకి వచ్చిన బలసాని కిరణ్ ప్రత్తిపాడు ఎమ్మెల్యే కావడం ఖాయమన్నారు. బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తన గెలుపు పేదల గెలుపుగా.. పెత్తందారులపై సాధించిన అతి పెద్ద విజయంగా చరిత్ర సృష్టిస్తుందన్నారు. జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము) మాట్లాడుతూ, గుంటూరు రూరల్ మండలం పార్టీకి కంచుకోట అన్నారు. సమావేశంలో ప్రత్తిపాడు నియోజకవర్గం పరిశీలకుడు అవుతు శ్రీనివాసరెడ్డి, గుంటూరు ఎంపీపీ ఇంటూరి పద్మాఅంజిరెడ్డి, మాజీ ఎంపీపీ లక్కాకుల థామస్ నాయుడు, జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు చైర్మన్ ఆళ్ల రవి దేవరాజు, కార్పొరేటర్లు యేరువ సాంబిరెడ్డి, స్మితపద్మజ, చల్లా రాజ్యలక్ష్మి, పార్టీ నేతలు ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, బండారి శ్రీను, నూనె వెంకటకోటిరెడ్డి, యోగీశ్వరరెడ్డి, నాగం కాశీ, గోళ్ల శివశంకర యాదవ్, దగ్గుల మల్లికార్జునరెడ్డి, కంది సంజీవరెడ్డి, జిల్లేపల్లి వేణు, కరీముల్లా, జానీ, రామాంజీ, జొన్నలగడ్డ సుబ్బారావు, డైరెక్టర్ పిల్లి మేరీ, శివాలశెట్టి రాధా, నూనె ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడు ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వృద్ధుడు ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. సాకేతపురంలో నివాసం ఉండే శివన్నారాయణ (70) ఈనెల 20వ తేదీ అనారోగ్య కారణలతో పురుగు మందు సేవించాడు. బంధువులు గుర్తించి అతనిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వార్డు సచివాలయంలో చోరీ

తెనాలిరూరల్: వార్డు సచివాలయంలో చోరీపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్ లింగారావు వార్డు రెండో సచివాలయం తాళాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారు. లోనికి వెళ్లి కౌంటరులో ఉంచిన రూ. 26,314 అపహరించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

వైఎస్సార్ సీపీ కొల్లిపర మండల ఎన్నికల కమిటీ ఏర్పాటు

కొల్లిపర(తెనాలి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కొల్లిపర మండల ఎన్నికల మానిటరింగ్ కమిటీని నియమించినట్టు పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మందపాటి శేషగిరిరావు ఓ ప్రకటనలో తెలిపారు. కొల్లిపర ఎన్నికల మానిటరింగ్ కమిటీ సభ్యులుగా పార్టీ నాయకులు ఆరిగ చంద్రశేఖర్‌రెడ్డి (మున్నంగి), బొమ్ము శ్రీనివాసరెడ్డి (బొమ్మువానిపాలెం), భట్టిప్రోలు శ్రీనివాసరావు (కొల్లిపర), మోర్ల శ్రీనివాసరావు (తూములూరు), కనపర్తి అనిల్ (అత్తోట), దేశబోయిన కోటేశ్వరరావు (అత్తోట) నియమించినట్టు ఆయన వివరించారు.

ఆహ్వానించి..ఆరుబయటే ఉంచి..



ఆర్వో కార్యాలయం ప్రధాన గేటు బయటే ఉండిపోయిన జనసేన, బీజేపి నాయకులు

ప్రత్తిపాడు: తన నామినేషన్ కు రండంటూ బూర్ల రామాంజనేయులు ఆహ్వానించడంతో జనసేన, బీజేపీ నాయకులు ఆనందపడ్డారు. కానీ పరిమితికి మించి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి వెళ్లకూడదన్న నిబంధనతో ఆరుబయటే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈనెల 22న బూర్ల నామినేషన్ వేయగా ఆయనవెంట సతీమణి జయమ్మ, మాజీ ఎమ్మెల్యేలు తాడిశెట్టి మురళి, రావి వెంకటరమణ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, బీజేపి నియోజకవర్గ కన్వీనర్ కన్నా రవిదేవరాజు, ఇతర పార్టీ నాయకులు తరలివెళ్లారు. అయితే ఆర్వో కార్యాలయం లోపలకు వెళ్లే సమయంలో గుంటూరు సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ మహబూబ్ బాషా పరిమితికి మించి అనుమతి లేదని స్పష్టం చేశారు. చేసేది లేక రావి వెంకటరమణ, తాడిశెట్టి మురళి, భార్య జయమ్మ, తెలుగుదేశం పార్టీ ప్రత్తిపాడు మండలాధ్యక్షుడు గింజుపల్లి శివరాంప్రసాద్ ను మాత్రమే తనతోపాటు రామాంజనేయులు లోనికి తీసుకెళ్లారు. ఈ నిర్ణయంతో జనసేన, బీజేపి నియోజకవర్గ నాయకులు ఆరుబయటే ఉండిపోవాల్సి వచ్చింది.

భవిష్యత్ అంతా ఏఐదే



ముఖ్య అతిథి సూర్యను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: రానున్న కాలం కృత్రిమ మేధ(ఏఐ)దేనని, ఇప్పటికే ఏఐతో పలు రంగాల్లో భారీ మార్పులు సంభవిస్తున్నాయని ఇ–ఎక్సలెన్స్ సంస్థ సీఈవో సూర్య తెలిపారు. మంగళవారం చౌడవరం ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యూచర్ ఆఫ్ జెనరేటివ్ ఏఐ అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సూర్యను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధకు అనుగుణంగా విద్యా విధానాన్ని అనుసరిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.. మెరుపు వేగంతో ఏ ఐ కంప్యూటింగ్ దూసుకుపోతోందని భవిష్యత్తులో ఏ ఐ మానవాళిని శాసించే స్థాయికి చేరనుందని కళాశాల అధ్యక్షులు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ అన్నారు. కార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ కె కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎమ్‌వీపీ చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పదిలో ప్రైవేటు పాఠశాలల హవా

పెదకాకాని: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు మార్కుల పంట పండించారు. మండలంలో ఐదు ప్రైవేటు పాఠశాల నుంచి 205 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 203 మంది ఉత్తీర్ణులయ్యారు. పెదకాకాని గీతాంజలి విద్యాలయ విద్యార్థిని పి రాజేశ్వరి 583, నంబూరు బీవీఆర్ పాఠశాలకు చెందిన షేక్ యిర్షాద్ 579, నాగార్జుననగర్ జేఎంజే స్కూల్‌కు చెందిన వి వీరప్పన్ సత్యచరణ్ 574 మార్కులు సాధించారు.

గర్భిణుల ఆరోగ్యంపై సీహెచ్‌ఓలకు శిక్షణ



గుంటూరు మెడికల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (సీహెచ్‌ఓ)లకు మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కేర్ కంపానియన్‌పై శిక్షణ జరిగింది. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి గర్భిణికి తప్పనిసరిగా బీపీ పరీక్ష చేసి నమోదు చేయాలన్నారు. ప్రతి గర్భిణిని భౌతికంగా పరిశీలించాలని చెప్పారు. ప్రమాదకర గర్భిణులను గుర్తించి, వీలైనంత త్వరగా నమోదు చేసి బీపీ, మధుమేహం, థైరాయిడ్, రక్తహీనత పరీక్షలు నిర్వహించాలన్నారు. తరచుగా వారి ఆరోగ్యంపై మెలకువగా ఉండాలని, హైరిస్క్ గర్భిణులను ట్యాగ్ చేసి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా ఎస్‌డీసీ (సేఫ్ డెలివరీ క్యాలెండర్) ప్రదర్శించి కాన్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. శిక్షకులు డాక్టర్ లక్ష్మి సుధా, డాక్టర్ గిరిధర్, వాత్సల్య, భానుశ్రీ, సోప్రతోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com